# తప్పని దృశ్యం

మంత్రిగారు సెక్రటరీ వంక చూశాడు ఏవిటన్నట్లు...

"సార్..." వినయంగా అన్నాడు సెక్రటరి...

"ఉఁ... చెప్పు..."

"రేపు మీరు పొద్దున ఎనిమిది గంటలకే రెడీగా ఉండాలి..."

మంత్రిగారి కనుబొమలు ముడుచుకున్నాయి. మొహం అసహనంగా మారింది.

"ఎనిమిది గంటలకా!!!..." ఆశ్చర్యంగా చూశాడు...

"అవున్సార్..."

"ఎందుకు?..."

"రేపు..."

"ఆఁ... రేపు ఏమిటయ్యా?"

"రేపు ఏప్రిల్ 14వ తేదీ సార్..."

"అయితే ఏంటంట?..."

సెక్రటరీ బిత్తరపోయాడు.

"ఏప్రిల్ 14, నా పుట్టిన తేదా...కాదు గదా..."

"అవున్సార్..."

"మరి రేపు పొద్దున ఎనిమిదింటికే ఎందుకు రెడీగా ఉండాలి?..."

"రేపు...రేపు... ఏప్రిల్ 14 సార్..."

"మళ్లీ అదే మాట... అయితే ఏందంట?..."

"అయ్యో గట్టిగా అనకండి సార్..."

"ఎందుకు?..."

"ఇటు వస్తున్న ఏ విలేకరో విన్నాడంటే ప్రమాదం..."

"ఎందుకయ్యా ప్రమాదం?..."

"మీరు వీకర్ సెక్షన్ల నాయకులు కదా సార్..."

"నాయకుణ్ణి కాదయ్యా... వీకర్ సెక్షన్ల దేవున్ని..."

మీరు దేవునిగా ఉండటం కోసం ఈ వీకర్ సెక్షన్లను ఎప్పటికీ ఇలాగే ఉంచుతారా సార్ అన్లేదు సెక్రటరీ... మంచివాడు, సిన్సియర్ బాయ్...!!!

మంత్రిగారికి చెడ్డపేరు రావద్దని తంటాలు పడుతున్నాడు. మంత్రిగారి అజ్ఞానం పత్రికలకు ఎక్కకూడదని ఆరాటపడుతున్నాడు.

"మీకు ఏప్రిల్ 14 గురించి తెలియదని పత్రికలు తాటికాయంత అక్షరాల్తో రాస్తాయి సార్... ఘోరం జరిగిపోతుంది..."

"ఏం ఘరం జరుగుతుందయ్యా... ఐడోంట్ కేర్... ఈ పత్రికలకు గిత్రికలకు భయపడే వాణ్ని కాదు... జనం నా వెంట ఉన్నారు... వీకర్ సెక్షన్లు నన్ను దేవునిగా కొలుస్తున్నారు..."

అదంతా మీ భ్రమసార్ అన్లేదు సెక్రటరీ... ఇలా అని చూశాడు....

"జనం తెలివి తెచ్చుకున్నారు సార్...పత్రికలు చూస్తున్నారు... శ్రద్ధగా చదువుతున్నారు..."

మంత్రిగారు మధ్యలోనే అందుకొని – "పత్రికలు చదవటం వల్ల జనం తెలివి తెచ్చుకున్నారంటావా... జనం తెలివి తెచ్చుకున్నందున పత్రికలు చదువుతున్నారు అంటావా?..." అని వాదనకు దిగాడు.

మంత్రిగారికి అసెంబ్లీలో అరవైసార్లు మైకులు విరిచిన రికార్డ్ ఉంది. ఆయనతో వాదించడం కష్టం అని సెక్రటరీకి కూడా తెలుసు.

"రేపు ఏప్రిల్ 14వ తేదీ... డా॥ అంబేద్కర్ జయంతి సార్..." అని సూటిగా చెప్పేశాడు.

అరరే అని మంత్రిగారు నాలిక్కరుచుకోలేదు. బాధపడలేదు. తనకా విషయం గుర్తుకు లేనందుకు కనీసం విచారించనూ లేదు.

"రేపు ఉదయం ఎనిమిదిన్నరకు మీరు అంబేద్కర్‌గారి విగ్రహానికి పూలమాలవేసి..."

ఆ తరువాత చేయవలసిన పనులు... ఏ ప్రదేశంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసేది...అన్నీ వివరంగా చెప్పాడు సెక్రటరీ...

"ఉఁ..." అన్నాడు మంత్రిగారు...

ఆ 'ఉఁ' ఎందుకన్నారు అంటే...ఆ విగ్రహాన్ని ముందు పెట్టుకొని వీకర్ సెక్షన్లను బాగా ఆకర్షించవచ్చునని మంత్రిగారికి బాగా తెలుసు.

తాను ఏ ప్రదేశంలోని విగ్రహానికి పూలమాల వేయాలో మరోసారి గుర్తుకు వచ్చి...

"అయితే మెట్లెక్కాలి కదా..." అని గాబరాపడిపోయారు మంత్రిగారు-

"అవున్సార్..."

"అమ్మో మెట్లెక్కడమే..."

"వీకర్ సెక్షన్లను తమవైపు తిప్పుకోవాలంటే ఏ నాయకుడైనా ఆ మెట్లెక్కాలి... ఆ విగ్రహానికి పూలదండ వేయాల్సిందే కదా సార్..."

"అన్ని మెట్లు ఎట్లా ఎక్కేదయ్యా... అసలే గుండె నొప్పి..." బెంబేలు పడిపోయారు మంత్రిగారు...

"డాక్టర్‌కు కబురు పంపాను సార్... పొద్దున్నే వచ్చి చెకప్ చేస్తానన్నారు..."

"గుండె జబ్బు డాక్టరే కదా..."

"అవున్సార్... ఆ డాక్టరే... మిమ్మల్ని ఎప్పుడూ చూసే అతనే... డాక్టర్ చెకప్ చేసి... అవసరమైతే మందులు ఇచ్చిన తరువాతనే వెళ్దాం... ఓకేనా సార్..." ఒకే అన్లేదు. మాట్లాడలేదు...తలూపారు మంత్రిగారు.

***

మరునాడు ఉదయం.

అక్కడ...

కెమెరాలు సిద్ధంగా ఉన్నాయి. వీడియో కెమెరాలు హడావుడి పడుతున్నాయి... విలేకర్లు తొందరపడుతున్నారు.

పోలీస్ వ్యాన్లు... పోలీస్ జీపులు...

పోలీస్ మోటార్ సైకిళ్లు... పోలీస్ లారీలు... పోలీసులు...

మామూలు మనుషులు...

మాసిన తలలు...మమతల కళ్లు...

ఎత్తైన అంబేద్కర్ విగ్రహం...

మంత్రిగారి కోసం ఎదురుచూపులు...

అక్కడ మంత్రిగారి ఇంట్లో చెకప్‌ల మీద చెకప్‌లు...అన్ని హెల్త్ చెకప్‌లు చేయించుకున్నారు మంత్రిగారు....ముఖ్యంగా గుండె చెకప్!!...

అసలు మంత్రిగారి గుండెలో గుండె ఉందా?... లేదు లేదు. గంపెడు భయం ఉంది. గాబరా గాబరాగా ఉంది -

అన్ని మెట్లు తాను ఎక్కగలడా?... మచ్చెమటలు పోశాయి... ఎంత వద్దనుకున్నా రాజకీయాల్లోని తనగొంతులు... కుట్రలు... దొమ్మి...దోపిడీ... హత్యలు...

ఒక్కటొక్కటే గుర్తుకొచ్చి... గుండె దడ దడ మొదలయింది.

గుండె బాగానే ఉంది. మీరు హాయిగా వెళ్ళి రావచ్చు అన్న డాక్టర్ మీద అనుమానం పెరుగుతున్నది. తన ప్రైవేట్ డాక్టర్ ప్రతిపక్షాల్లో చేరలేదు కదా...!

డాక్టర్ చెక్ చేసినప్పుడు బాగానే ఉన్నాడు. గుండె బాగానే ఉంది...

ఆ మెట్లు...పూలదండ గుర్తుకొచ్చేసరికి... అడుగు వేయబోయే సరికి... గుండె దడ దడ... గడబిడ... అదంతా డాక్టరుకు తెలియదు కదా...

"పదండి సార్..." సెక్రటరీ వినయంగా మంత్రిగారిని కారు దాకా నడిపించుకు పోయాడు.

మంత్రిగారు కార్లో కూర్చున్నారు.

కారు కదిలింది. ఒక్క కర్చీఫ్ సరిపోదని...ఏకంగా న్యాప్ కిన్‌నే వెంట తెచ్చుకున్నారు మంత్రిగారు.

అంబేద్కర్ విగ్రహం దగ్గర కారు ఆగగానే నిజంగా మంత్రిగారికి గుండె ఆగినంత పనైంది.

ఆ విగ్రహం చేరడానికి అయ్యబాబోయ్ ఎన్ని మెట్లు...!

ఆ విగ్రహాన్ని అంత ఎత్తున ఎందుకు పెట్టారు?..."

అసహనంగా సెక్రటరీని అడిగారు మంత్రిగారు.

"జనం గుండెల్లో మరి ఆయన అంత ఎత్తున ఉన్నారు సార్..." వినయంగా చెప్పాడు సెక్రటరి.

కెమరాలు క్లిక్‌మంటున్నాయి...

షో మొదలయింది...

వీడియోలు ఆన్...చప్పట్లు ఆన్... విలేకర్ల చూపులు ఆన్... విజిల్స్ ఆన్...

మంత్రిగారు మెట్ల వైపు నడవక తప్పలేదు.

మొదటి మెట్టు దగ్గర నిల్చొని ఒక్కసారి తలపైకెత్తి చూసే సరికి... అంత ఎత్తున అంబేద్కర్ విగ్రహం... అన్ని మెట్లు...పిపీలికంలా మంత్రిగారు!

పిపీలికం వణికిపోతుందో లేదో కాని... మంత్రిగారు ఆ మెట్లు చూసి వజవజ వణికిపోతున్నారు. ఎంతో గట్టిదనుకున్న వెన్నుపూసలో జొరం జొరం!!

ఒక్క మెట్టు ఎక్కబోయేసరికి... ఆ వణుకులో... పదవుల కోసం తనపార్టీ ఫిరాయింపులు... వెన్నుపోట్లు... కత్తిపోట్లు... జనం కళ్లల్లో కారం...దుమ్ము... ధూళి... కోట్ల ఆస్తులు... అవన్నీ గుర్తుకొచ్చి హడలిపోతున్నారు. అవన్నీ ఇప్పుడు తన మీద కక్షతీర్చుకుంటాయేమో!

పాదాలు తడబడుతున్నాయి... కాళ్ళు నిలవలేకపోతున్నాయి... ఆ మెట్లు తనకు శిక్షలా కనబడుతున్నాయి... కళ్లకు చీకట్లు కమ్ముతున్నాయి...

జనం కళ్లల్లో కారం... దుమ్ము... ధూళి...దొమ్మి... దోపిడీ... వెన్నుపోటు... కత్తిపోట్లు... కోట్ల కోట్ల లంచాలు...ఈ క్షణంలో తనను ఏ దేవుడు ఎందుకు ఆదుకుంటాడు?... ధైర్యం తెచ్చుకోదానికి తానుచేసిన ఒక్క మంచిపని లేదు... అన్ని మెట్లెక్కితే తనకు గుండెపోటు వస్తుంది...

వస్తుంది...

వచ్చేసింది...

అడుగు తీసి మెట్టు మీద అడుగు వేయబోయిన మంత్రిగారు... కుప్పలా కూలిపోయారు!!...

*వార్త, ఆదివారం, 5-5-2007*